

108 శివలింగాల క్షేత్రం.. గుడిమెట్ ఆలయం..

2



2

'డబుల్' ఇళ్లకు పట్టాలు ఇవ్వాలి


AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in

## ఎంఎడ్ పరీక్ష ఫీజు నోటిఫికేషన్ విడుదల

**అక్షరటుడే, డిచ్ పల్లి:** తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలో ఆగస్టు/సెప్టెంబర్ 2025లో నిర్వహించే ఎంఎడ్ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, ఒకటి, రెండు, మూడో సెమిస్టర్ బ్యాక్ లాగ్ థియరీ పరీక్షల ఫీజు చెల్లింపు కోసం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 18 లోపు పరీక్ష ఫీజు చెల్లించాలని, రూ.100 అపరాధ రుసుముతో ఈ నెల 21వ తేదీ వరకు చెల్లించవచ్చని వర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ సంపత్ కుమార్ తెలిపారు. పూర్తి వివరాలకు తెలంగాణ వర్సిటీ వెబ్ సైట్‌ను సంప్రదించాలని సూచించారు.



## రేపు ఆర్మూర్‌కు మందకృష్ణ మాదిగ రాక



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని ఎంఆర్ గార్డెన్స్‌లో వికలాంగుల, చేయూత పెన్షన్ దారుల సన్నాహక గర్జన సదస్సును మంగళవారం నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరు కానున్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కనక ప్రమోద్ ఆధ్వర్యంలో సోమవారం జక్రాన్‌పల్లి మండలం సికింద్రాపూర్‌లో పర్యటించారు. బీడీ కార్మికులు, వృద్ధులను కలిసి గర్జన సదస్సుకు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు వేల్పుల వరుణ్, అనిల్ పాల్గొన్నారు.

## కోర్టు ఏర్పాటు కోసం భవనాల పరిశీలన



**అక్షరటుడే, భీమ్‌గల్:** పట్టణంలో కోర్టు ఏర్పాటుకు అధికారులు సోమవారం స్థలాన్ని పరిశీలించారు. తహశీల్దార్ షబ్బీర్, ఎంపీడీవో సంతోష్ కుమార్, ఎంఈవో స్వామి సోమవారం పలు భవన సముదాయాలను పరిశీలన చేశారు. జిల్లా జడ్జి ఆదేశాల మేరకు ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్, పాత మండల పరిషత్ భవనం, పీఆర్టీయూ భవనం, మరో ప్రైవేట్ భవనాన్ని పరిశీలించారు. కోర్టు నిర్వహణకు నూతన భవనం నిర్మించే వరకు తాత్కాలిక భవనంలో కొనసాగుతుందన్నారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు. వారి వెంట న్యాయవాదులు చైతన్య, సురేష్ ఉన్నారు.

## బీడీ ఫ్యాక్టరీని ముట్టడించిన కార్మికులు

**అక్షరటుడే, డిచ్‌పల్లి :** నెలలో పనిదినాలు పెంచాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు డిమాండ్ చేశా రు. ఈ మేరకు డిచ్‌పల్లి శివాజీ కంపెనీ ఎదుట సోమవారం కార్మికులు ఆందోళనకు దిగారు. అనంతరం కంపెనీ బ్రాంచ్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటి మాట్లాడుతూ.. గత కొన్ని నెలలుగా బీడీ కార్మికులకు నెలకు తొమ్మిది నుంచి పది రోజుల పని మాత్రమే కల్పిస్తున్నారన్నారు. దీంతో చేతినిండా పనిలేక బీడీ కార్మికులు నష్టపోతున్నారని ఆయన పేర్కొన్నారు. నూతన పీఎఫ్ నంబర్లను ఇవ్వాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఏరియా కార్యదర్శి కిషన్, జిల్లా నాయకులు మురళి, కమీషన్‌దారులు నర్సయ్య, సాయినాథ్ సుదర్శన్, శ్రీధర్ గణేష్, రవి, కార్మికులు లక్ష్మి, సుజాత పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డి రాక అంశం కామారెడ్డి కాంగ్రెస్‌లో హాట్ టాపిక్‌గా మారింది. స్థానిక ఎన్నికల నేపథ్యంలో ఆయన కామారెడ్డికి రానున్నారన్న సమాచారం ఆ పార్టీ నేతల్లో గందరగోళానికి తెరతీసింది. ఆదివారం 'అక్షరటుడే'లో ప్రచురితమైన 'కామారెడ్డిలో కొండల్ రెడ్డి పాగా!' కథనం పార్టీలో తీవ్ర చర్చకు దారి తీసింది. అసలు కామారెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఏం జరుగుతోందని చర్చించుకుంటున్నారు. – అక్షరటుడే, కామారెడ్డి

# కామారెడ్డి కాంగ్రెస్‌లో కటౌట్ల కలకలం

**సీఎం సోదరుడు కొండల్ రెడ్డి రాకపై తీవ్ర చర్చ**
**కటౌట్స్ ఎవరు ఏర్పాటు చేశారో ఆరా తీస్తున్న నాయకులు**




కామారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్‌లో విబేధాలు తారాస్థాయికి చేరాయన్న ప్రచారం జరిగింది. సొంత పార్టీ నేతల మధ్య విబేధాలు రావడం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. ఈ తరుణంలో పార్టీ నాయకులను ఒకే తాటిపైకి తెచ్చేందుకు కసరత్తు జరుగుతోందని తెలుస్తోంది. అందులో భాగంగానే సీఎం సోదరుడు కొండల్ రెడ్డి నేరుగా రంగంలోకి దిగుతున్నారన్న ప్రచారం సాగుతోంది. ఆయన కామారెడ్డిలో మకాం వేసి ఇక్కడి నేతల పనితీరును పరిశీలించనున్నట్టుగా సమాచారం. ఈ క్రమంలో ఇక్కడ షబ్బీర్ అలీ ఉండగా కొండల్ రెడ్డి రావాల్సిన అవసరం ఏముందన్న చర్చ ప్రస్తుతం పార్టీలో సాగుతున్నట్లు తెలిసింది.

### కటౌట్ల దుమారం


కామారెడ్డి పట్టణంలో ప్రధాన కూడళ్లలో సీఎం రేవంత్ రెడ్డి, ఆయన సోదరుడు కొండల్ రెడ్డి నిలువెత్తు కటౌట్లు ఏర్పాటు చేయడం ఇప్పుడు పార్టీలో దుమారం రేపుతోంది. ఈ కటౌట్లు ఎవరు ఏర్పాటు చేశారు. ఎందుకు ఏర్పాటు చేశారో తెలియక నాయకులు తలలు పట్టుకుంటున్నారు. స్థానిక నేతల ఫొటోలు లేకుండానే ఏర్పాటు చేయడం వెనక బలమైన కారణం ఉండే ఉంటుందని నాయకులు గుసగుసలాడుతున్నారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి షబ్బీర్ అలీ ఫొటో లేకుండా కటౌట్లు పెట్టడంతో ఆయన అనుచరులు అయోమయానికి గురవుతున్నారు.

### నేతల మధ్య సఖ్యత కోసమేనా..?

నియోజకవర్గంలో ముఖ్య నాయకుల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరడం, నేరుగా పీసీసీ చీఫ్‌కు ఫిర్యాదులు వెళ్లడంపై అధిష్ఠానం సీరియస్‌గా ఉన్నట్టుగా తెలుస్తోంది. నేతల మధ్య వర్గపోరు పార్టీకి తలనొప్పిగా మారడంతో దీనికి ఫుల్‌స్టాప్ పెట్టాలని అధినాయకత్వం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే స్థానిక ఎన్నికల్లోపు వర్గపోరు, గ్రూపు రాజకీయాలకు చెక్ పెట్టేలా కొండల్ రెడ్డిని కామారెడ్డికి పంపించనున్నట్లు తెలుస్తోంది. ఆయన కామారెడ్డిలోనే మకాం వేసి నాయకుల మధ్య విబేధాలు లేకుండా చేస్తారన్న ప్రచారం సాగుతోంది.



## జిల్లాకు చేరుకున్న బ్యాలెట్ బాక్స్‌లు



స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలకు ఎన్నికల సామగ్రిని సమకూరుస్తోంది. ఈ మేరకు జిల్లాకు సోమవారం బ్యాలెట్ బాక్స్‌లు చేరుకున్నాయి. బైపాస్ రోడ్‌ని కలెక్టరేట్‌కు బ్యాలెట్ బాక్స్‌లను తీసుకొచ్చారు. వీటిని గుజరాత్‌లోని అహ్మదాబాద్ నుంచి జిల్లాకు తీసుకొచ్చినట్లు సమాచారం. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండేలా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. అయితే జిల్లాకు చేరుకున్న బ్యాలెట్ బాక్స్‌లను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయా మండలాలకు తరలించనున్నారు. - అక్షరటుడే, ఇందూరు

## 40 టీఎంసీలకు చేరిన శ్రీరాంసాగర్

**అక్షరటుడే, ఆర్మూర్:** శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు స్వల్ప ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. జలాశయంలో నీటిమట్టం 40 టీఎంసీలు దాటడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా కురిసిన వర్షాలతో ప్రాజెక్ట్‌లోకి 7,479 క్యూసెక్కుల వరద వస్తోంది. పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 1078.10 (40.02 టీఎంసీలు) అడుగుల నీరు ఉంది. సోమవారం ఉదయం 8,175 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా అనంతరం 7,479 క్యూసెక్కులకు తగ్గిపోయింది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువకు 100 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో నీటి నిల్వ 40 టీఎంసీలకు చేరడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో నీరు ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఆనంద పడుతున్నారు. నీటిమట్టం 50 టీఎంసీలు దాటిన తర్వాత కాల్వల ద్వారా ఆయకట్టుకు విడుదల చేసే అవకాశం ఉంది.





## ప్రజావాణికి 143 ఫిర్యాదులు

**అక్షరటుడే, ఇందూరు:** ప్రజావాణికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 143 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అధికారులకు విన్నవించారు. కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్మావి, డీఆర్డీవో సాయాగౌడ్, డీపీవో శ్రీనివాస్ రావు, నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్ రెడ్డికి అర్జీలు స్వీకరించారు. కాగా.. వినతులను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

## క్రీడలతో ఒత్తిడి దూరం: సీపీ




**అక్షరటుడే, ఇందూరు:** క్రీడలతో ఉద్యోగుల్లో ఒత్తిడి దూరమవుతుందని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తెలిపారు. ట్రాన్స్‌కో, డిస్కం ఇంటర్ సర్కిల్ హాకీ పోటీలు సోమవారం నగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఆరోగ్యంగా ఉండాలంటే క్రీడలు ఎంతో అవసరమన్నారు. అలాగే ఇతర జిల్లాల నుంచి వచ్చిన ఉద్యోగులతో స్నేహం ఏర్పడుతుందన్నారు. దీంతో ఉద్యోగ బాధ్యతలను సులువుగా నిర్వహించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. విద్యుత్ సౌధకు చెందిన ఉద్యోగి శ్రీనివాస్ రెడ్డిని సీపీ సన్మానించారు. పోటీల్లో నిజామాబాద్, కామారెడ్డి, నల్గొండ, కరీంనగర్, విద్యుత్ సౌధ హాకీ జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామచంద్రరావు, నిజామాబాద్ ఎస్ఈ రాపల్లి రవీందర్, కామారెడ్డి ఎస్ఈ శ్రావణ్ కుమార్, ట్రాన్స్‌కో రాష్ట్ర స్పోర్ట్స్ ఆఫీసర్ జగన్నాథ్, డైరెక్టర్లు తిరుపతి రెడ్డి, మోహన్, మధుసూదన్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ ఏడీఈ తోట రాజశేఖర్, డీఈలు రమేష్, విక్రమ్, ఏఏవో గంగారం నాయక్, జేఏవో సురేష్ కుమార్, ఏడీఈ బాలేష్ కుమార్, శంకర్ నాయక్, స్పోర్ట్స్ సెక్రెటరీ గోపి, పీవో పోశెట్టి, స్పోర్ట్స్ కౌన్సిల్ ఉత్తమ్, సునీత, వివిధ సంఘాల నాయకులు రాజేందర్, గంగాధర్, చెన్నయ్య పాల్గొన్నారు.



## సమస్యలు పరిష్కరించాలని వినతి



**అక్షరటుడే, నిజాంసాగర్:** జనహిత పాదయాత్ర పూర్తి చేసుకున్న కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ సోమవారం ప్రత్యేక రైలులో ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ఈ మేరకు జుక్కల్ నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ జయ ప్రదీప్ ఆమె వెంట ఉన్నారు. ఈ సందర్భంగా ఆమెతో జుక్కల్ నియోజకవర్గ సమస్యల గురించి చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ఖాయమని.. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఆమెకు వివరించారు.

## విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేయాలి

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలోని ప్రతి విద్యార్థికి నులిపురుగుల నివారణ మాత్రలను అందజేయాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో డీవార్మింగ్ డే కార్యక్రమంపై సోమవారం టాస్క్‌ఫోర్స్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 19 ఏళ్ల వయసు లోపు విద్యార్థులందరికీ మాత్రలు వేయాలన్నారు. ప్రధానంగా ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, మదర్సాలు, అంగన్‌వాడీ కేంద్రంలోని విద్యార్థులకు, బడిబయట పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని చెప్పారు. ప్రతి పాఠశాలలో కళాశాలలో ఒక నోడల్ అధికారిని నియమించాలని సూచించారు. భోజనం తిన్న తర్వాత ఈ మాత్ర వేయాలన్నారు. ప్రధానంగా రక్తహీనత, బరువు తగ్గుదల తదితర వ్యాధుల నుంచి కాపాడడానికి ఈ మాత్ర దోహదపడుతుందని పేర్కొన్నారు. గ్రామాల్లో మైకుల ద్వారా.. పట్టణాల్లో చెత్త సేకరణ వాహనాల ద్వారా ప్రచారం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈనెల 9, 10వ తేదీల్లో రెండు రోజులపాటు తప్పనిసరిగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనాథ బాలల ఆశ్రమాలు, బాలల సంరక్షణ కేంద్రాలు, రెస్క్యూ హోంలలో కూడా డీవార్మింగ్ డేను నిర్వహించాలని సూచించారు. 11వ తేదీన మాత్రలు ప్రతి విద్యార్థులకు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా విద్యార్థులకు అందకపోతే మలివిడతగా 18వ తేదీన వేయించాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా 19 ఏళ్లలోపు వయసు కలిగిన వారు సుమారు 4.05 లక్షల మంది ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో డీఎంహెచ్‌వో రాజశ్రీ, అదనపు కలెక్టర్ అంకిత్, డీపీవో శ్రీనివాసరావు, ప్రోగ్రామ్ ఆఫీసర్ అశోక్, డీడబ్ల్యూవో రసూల్ బీ తదితరులు పాల్గొన్నారు.




## తెయూ సౌత్ క్యాంపస్‌లో విద్యార్థుల ఆందోళన

**అక్షరటుడే, కామారెడ్డి:** భిక్కనూరు సౌత్ క్యాంపస్ హాస్టల్ గదిలో ఆదివారం రాత్రి పీజీ సెకండ్ ఇయర్ విద్యార్థి అశ్విని ఆత్మహత్య కలకలం సృష్టించింది. దీంతో సోమవారం విద్యార్థులు క్యాంపస్ ఆవరణలో ఆందోళనకు దిగారు. కళాశాలలో అనారోగ్య సమస్యలు, ఏవైనా ప్రమాదాలు జరిగినా ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు సరైన వసతులు లేవంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. క్యాంపస్‌లో ఉన్న అంబులెన్స్ సమయానికి స్టార్ట్ అయిఉంటే.. అశ్విని బతికేదని విద్యార్థులు వాపోయారు. క్యాంపస్ సిబ్బంది కూడా సరైన సమయంలో స్పందించలేదని వారు ఆరోపించారు. అంబులెన్స్ స్టార్ కావడానికి గంట సమయం పట్టిందని పేర్కొన్నారు. అంబులెన్స్ వల్లే విద్యార్థిని ప్రాణాలు కోల్పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో అశ్వినిని బైక్‌పై దోమకొండకు, అక్కడి నుంచి జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లామని విద్యార్థులు పేర్కొన్నారు. జిల్లా ఆస్పత్రికి వెళ్లేసరికి అశ్విని మృతి చెందిందని వైద్యులు చెప్పినట్లు తెలిపారు. క్యాంపస్‌లో అంబులెన్స్ సౌకర్యం లేక విద్యార్థుల ప్రాణాల మీదకు వస్తోందని ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించారు. వీసీ వచ్చి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వీసీ అందుబాటులో లేకపోవడంతో రిజిస్ట్రార్ యాదిగిరి క్యాంపస్‌కు వచ్చి విద్యార్థులతో మాట్లాడారు. అంబులెన్స్ ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. క్యాంపస్‌లో మెడిసిన్ అందుబాటులో ఉంచుతామని, తాత్కాలికంగా వైద్యుడిని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.



## డబుల్ బెడ్ రూం ఇళ్లకు పట్టాలు అందజేయాలి



**అక్షరటుడే, ఇందల్వాయి:** మండలంలోని ఇందల్వాయిలో గత ప్రభుత్వం అర్హులైన సుమారు 50 మంది పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేసింది. కానీ వారికి పట్టాలు అందజేయలేదు. దీంతో లబ్ధిదారులు సోమవారం ఎమ్మెల్యే భూపతిరెడ్డిని ఆయన క్యాంప్ ఆఫీస్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే 20 రోజుల్లో సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ సీనియర్ నాయకుడు సాయాగౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నవీన్ గౌడ్, నాయకులు లక్కవత్రి రాందాస్, గంట రాజేందర్, గొల్ల రాంబాబు, పెద్ద సాయిలు, సాయాబ్ హుస్సేన్, మునిపుష్ప, మీనా, ఎస్.కె సమీనా బేగం, జగ్గుదాస్, ఎడపల్లి సాయిలు, బెస్త బుచ్చన్న, సుంకర లక్ష్మి, కృష్ణవేణి, 50 మంది బాధితులు పాల్గొన్నారు.

## ఈవ్‌టీజింగ్ చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి




**అక్షరటుడే, భీమ్‌గల్:** మహిళల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా.. ఈవ్‌టీజింగ్ చేసినా వెంటనే షీటీంకు సమాచారం ఇవ్వాలని.. సబ్ డివిజన్ షీటీం కానిస్టేబుళ్లు విగ్నేష్ సుమతి సూచించారు. చేంగల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'చట్టాలు వాటి పరిధి', క్రైంకు తదితర అంశాలపై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినులు, ఉద్యోగినులు, మహిళలు ఈవ్‌టీజింగ్, వేధింపులకు గురైతే పోలీస్‌శాఖ ఏర్పాటు చేసిన షీటీంకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన మహిళలు, విద్యార్థినుల పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. షీటీం 8712659795కు, డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. క్యూ ఆర్ కోడ్ ద్వారా షీటీంకు ఫిర్యాదు చేసే విధానాన్ని విద్యార్థినులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## నవోదయలో షీటీంపై అవగాహన



**అక్షరటుడే, నిజాంసాగర్:** మండలంలోని నవోదయ విద్యాలయంలో సోమవారం పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, డ్రగ్స్, షీటీం సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై శివకుమార్ మాట్లాడుతూ.. ఎస్పీ రాజేశ్‌చంద్ర ఆదేశాల మేరకు పోలీసు కళాబృందంతో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా కళాబృందం సభ్యులు విద్యార్థులకు సైబర్ నేరాలపై ఫిర్యాదుకు టోల్ ఫ్రీ నం. 1930, షీటీం నంబర్ 8712686094, 100 డయల్‌పై అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్, డ్రంకన్ డ్రైవింగ్, డ్రగ్స్, తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో పోలీస్ కళాబృందం ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుల్ తిరుపతి, శేషారావు, నవోదయ విద్యాలయం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

**అక్షరటుడే, లింగంపేట:** పురుగుల మందు సేవించి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన లింగంపేట మండలం అయ్యపల్లిలో చోటు చేసుకుంది. లింగంపేట్ ఇన్‌ఛార్జి ఎస్సై భార్గవ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. అయ్యపల్లి తండాలో మూడు రోజుల క్రితం మేకల చోరీ జరిగింది. ఈ ఘటనలో కేసు నమోదు కాగా.. చల్ల మహేశ్, కాంట్రపల్లి ప్రవీణ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే ఈ కేసులో ప్రధాన నిందితులతో పాటు మరో ఇద్దరు కూడా మేకల చోరీకి పాల్పడ్డట్లుగా ఓ పత్రికలో వార్త ప్రచురితమైంది. దీంతో సంబంధం లేని కేసులో తన పేరు రాసినందుకు అవమానంగా భావించిన అయ్యపల్లి గ్రామానికి చెందిన చిలుక లక్ష్మీనారాయణ (40) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో గ్రామస్థులు ఆగ్రహానికి గురై ఆదివారం పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఆందోళనకు దిగారు. దీంతో ఎల్లారెడ్డి సీఐ రాజిరెడ్డి పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని వారిని సముదాయించారు. మృతుడి భార్య మంజుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు పత్రిక విలేకరి, మహేష్, ప్రవీణ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌ఛార్జి ఎస్సై వివరించారు.



# 108 శివలింగాల క్షేత్రం..
# గుడిమెట్ ఆలయం..

▸ గుట్టపై ప్రత్యేకమైన లింగాకార ఆలయం ▸ శ్రావణమాసంలో ఆధ్యాత్మిక శోభ ▸ మూడు, నాలుగు సోమవారాల్లో గిరిప్రదక్షిణ

**గాంధారి మండలంలోని గుడిమెట్ గుట్టపై కొలువైన లింగాకార శివాలయం ప్రత్యేకతను చాటుకుంటోంది. నాలుగు దిక్కుల్లో ఎటువైపు నుంచి చూసినా.. లింగాకారమే కనిపించేలా ఈ గుడిని నిర్మించారు. వేల ఏళ్ల చరిత్ర ఉన్న ఈ ఆలయం గుట్టపై కొలువై ఉంది. ఆలయానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణంతోపాటు ఇక్కడి ప్రకృతి రమణీయత కట్టిపడేస్తాయి. ప్రస్తుతం శ్రావణ మాసం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. దీంతో ఆలయం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.**

**- అక్షరటుడే, గాంధారి**

గుడిమెట్ ఆలయంలో 108 జ్యోతిర్లింగాలు ఎక్కడి నుంచి చూసినా.. ఒకేలా వరుస క్రమంలో అమర్చినట్టుగా కనిపిస్తాయి. ద్వాదశ జ్యోతిర్లింగాలు, కోటిలింగేశ్వర ఆలయం ఇక్కడ కొలువై ఉన్నాయి. నాలుగు దిక్కుల్లో ఎక్కడి నుంచి చూసినా లింగాకృతి కనిపించేలా గుడి నిర్మాణం ఇక్కడి ప్రత్యేకత. అలాగే ఇక్కడి స్పటిక లింగం సైతం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. స్పటిక లింగం అవతలి వైపు జ్యోతిని ప్రజ్వలించిన తరువాత ముందువైపు భాగం నుంచి చూస్తే లింగంలో ముక్కంటి చూపుతో చూసినట్టుగా కనిపిస్తుంది. భక్తులు ప్రతిరోజు దర్శనం చేసుకుని పూజలు నిర్వహిస్తారు.

### ప్రత్యేకంగా గిరి ప్రదక్షిణ..

శ్రావణమాసం పురస్కరించుకుని మూడు, నాలుగు సోమవారాల్లో గిరి ప్రదక్షిణ ఉంటుంది. భక్తులు గిరి ప్రదక్షిణ చేసి ఆలయంలో పూజలు చేస్తారు. అలాగే భక్తుల కోసం అన్నదానం నిర్వహిస్తారు.



**భక్తుల తాకిడి పెరిగింది..**

లింగాకారంలో గుడి ఇక్కడి ప్రత్యేకత. దాదాపు ఏళ్ల నాటి ఆలయం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. ప్రస్తుతం శివుడికి ప్రీతికరమైన శ్రావణమాసం కావడంతో భక్తులు వస్తున్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. ఇక్కడ అర్ష గురుకులంలో పిల్లలకు వేద విద్య కూడా అందిస్తున్నాం.

**– మహదేవ్ స్వామిజీ**

## రుణాలు సద్వినియోగం చేసుకోవాలి



**అక్షరటుడే, భీమ్‌గల్:** మహిళా సంఘాల సభ్యులు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ కమ్యూనికేషన్ కో-ఆర్డినేటర్ గడాల రఘుపతి అన్నారు. మండలంలోని చెంగల్ గ్రామంలో సోమవారం గ్రామ సంఘ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎస్‌బీఐ కొత్త మేనేజర్ శృతిని శాలువాతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బ్యాంకు రుణాలు తీసుకున్న సంఘాలకు ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు అందిస్తుందన్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా ఐకేపీ పని చేస్తుందన్నారు. బ్యాంకు మేనేజర్ శృతి మాట్లాడుతూ.. తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించి, ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. పీఎం సురక్ష, జీవన్ జ్యోతి బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీవో అధ్యక్షురాలు స్రవంతి, లక్ష్మి, వీవోఏలు సునీత, శిరీష, మహిళా సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



**అక్షరటుడే, నిజాంసాగర్:** మండలంలోని మాగి గ్రామానికి చెందిన షేక్ ఫారూక్ అలీ ప్రమాదవశాత్తు గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందాడు. సీఎం సీఎం సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకోగా చెక్కు మంజూరైంది. దీంతో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆదేశాల మేరకు గ్రామ కాంగ్రెస్ నాయకులు సోమవారం ఫరూక్ అలీకి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుర్రపు శ్రీనివాస్, వెంకటేశం, కమ్మరి సాయిలు, కుర్మ కాశయ్య, రాములు, నారాయణ, గంగారాం, కిష్టయ్య, శాదుల్, పోచయ్య, పాల్గొన్నారు.


## ధర్నాను విజయవంతం చేయండి

**అక్షరటుడే, భీమ్‌గల్:** విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 5న జిల్లా కేంద్రంలో చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్ పీసీ) జిల్లా నాయకులు జాన్ విల్సన్, గట్టు ఈశ్వర్, సంగీత పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులందరికీ పెండింగ్ బకాయిలు చెల్లించాలని కోరారు. టైం స్కేల్, గురుకులాల్లోని గెస్ట్, పార్ట్ టైం, అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు కనీస వేతనం ఇవ్వాలని కోరారు.

## భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు జైలు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** భార్యను వేధించి, ఆత్మహత్యకు కారకుడైన భర్తకు న్యాయస్థానం జైలుశిక్ష విధించింది. వివరాల్లోకి వెళ్తే.. గాంధారి మండలం చద్మల్ గ్రామానికి చెందిన మౌనికకు మంచిప్ప గ్రామానికి చెందిన సాయికుమార్‌తో ఏడేళ్లక్రితం వివాహమైంది. అయితే వివాహమయ్యాక అనేకమార్లు భార్యభర్తల మధ్య గొడవలు జరిగాయి. భర్త తీరు మారకపోవడం, ఆయన వేధింపులు ఎక్కువ కావడంతో మౌనిక 2023 ఆగస్ట్ 28వ తేదీన ఆత్మహత్యకు పాల్పడింది. ఆమెకు కుమారుడు ఉన్నాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేశారు. కేసు పూర్వపరాలు పరిశీలించిన జిల్లా న్యాయమూర్తి భరత లక్ష్మీ.. మౌనిక ఆత్మహత్యకు కారణమైన భర్త సాయికుమార్‌కు పదేళ్ల జైలు శిక్ష విధించింది. అలాగే భార్యను వేధించిన కేసులో మూడేళ్ల సాధారణ జైలుశిక్ష విధించారు. రూ. వెయ్యి జరిమానా వేశారు. ఈ కేసులో సాయికుమార్ తల్లిని నిర్దోషిగా పేర్కొంటూ తీర్పునిచ్చారు.

## పడగల్‌లో విద్యుత్ సమస్యను పరిష్కరించండి



**అక్షరటుడే, భీమ్‌గల్:** వేల్పూర్ మండలంలోని పడగల్ గ్రామంలో సాగునీటికి విద్యుత్ సరఫరా సమస్యను పరిష్కరించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం ట్రాన్స్‌కో ఎస్ఈ రవీందర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని వెంటనే గ్రామంలో విద్యుత్ సమస్యకు పరిష్కారం చూపాలని ఆయన ఎస్ఈని కోరారు. మూడు రోజుల క్రితం గ్రామంలో పంటలకు అసలు కరెంట్ ఇవ్వలేదని రైతులు ఆరోపించారు. గత రెండురోజులుగా ఆరు గంటల చొప్పున విద్యుత్ ఇస్తున్నారని.. దీంతో పంటలకు నీళ్లు సరిగ్గా అందక ఎండిపోయే పరిస్థితి నెలకొందని వారు వాపోయారు. మొక్కజొన్న పంట పూర్తిగా ఎండిపోయే స్థితిలో ఉందని రైతులు ఎమ్మెల్యేకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. రైతులందరూ సబ్‌స్టేషన్‌కు వెళ్లి అధికారులను అడిగితే లోఓల్టేజ్ సమస్య ఉందని.. 3 కెపాసిటర్ సెల్స్, నాలుగు బ్యాటరీలు ఉంటే సమస్య పరిష్కారం అవుతుందని చెబుతున్నారని వారు పేర్కొన్నారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే ఎస్ఈకి ఫోన్ చేశారు. వెంటనే మెటీరియల్ సప్లయ్ చేసి కరెంట్ సమస్య త్వరితగతిన పరిష్కరించి రైతులకు కరెంట్ ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం




**అక్షరటుడే, ఇందూరు:** యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఆయూష్ విభాగం ఇన్‌ఛార్జి డాక్టర్ గంగాదాస్ అన్నారు. ప్రతిఒక్కరూ యోగా చేయడం అలవర్చుకోవాలని సూచించారు. యోగాకు సర్వరోగాలను నయంచేసే శక్తి ఉందని వివరించారు. నవీపేట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుతున్న జీవన విధానంలో ఆయుర్వేద పాత్ర ఎంతో కీలకమన్నారు. ఆరోగ్య పరిరక్షణలో యోగా ప్రముఖపాత్ర పోషిస్తుందన్నారు. అలాగే ఔషధ మొక్కలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. వ్యాధులు సోకితే ఔషధ గుణాలు కలిగిన మొక్కలే వైద్యానికి ఉపయోగపడతాయని ఆయన వివరించారు. ఇంటిచుట్టుపక్కల పరిశుభ్రత పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు తిరుపతి, ఆయుష్ ఫార్మసిస్టులు పురుషోత్తం, ఉమా ప్రసాద్, పాఠశాల ప్రిన్సిపాల్ పద్మకుమారి, యోగా శిక్షకుడు రాజేందర్, పారామెడికల్ సిబ్బంది రమేష్, భిక్షపతి, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.




## పోగొట్టుకున్న ఫోన్ల రికవరీ

**అక్షరటుడే,బోధన్:** పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న పది మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్లు సీఐ వెంకట్‌నారాయణ తెలిపారు. ఈ మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసిన ఫోన్లను బాధితులకు సోమవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో తిరిగి అందజేసినట్లు చెప్పారు. ఎవరి ఫోన్లయినా చోరీకి గురైతే వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

## కేజీబీవీ పాఠశాలకు కంప్యూటర్ల అందజేత



**అక్షరటుడే, భీమ్‌గల్:** బాల్కొండ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయానికి విద్యావేత్త, ప్రముఖ పారిశ్రామికవేత్త ఏనుగు దయానంద రెడ్డి కంప్యూటర్లు స్పాన్సర్ చేశారు. వీటిని పీడీ రాజ్ కుమార్ చేతుల మీదుగా పాఠశాల ప్రత్యేకాధికారిణి భవానీకి సోమవారం అందజేశారు. విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించాలనే ఉద్దేశంతో దయానంద రెడ్డి రూ.1.5లక్షలతో కంప్యూటర్లు ఇతర పరికరాలను అంజేయడంపై వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** నస్రుల్లాబాద్ మండలంలోని మైలారం, నెమ్లి గ్రామాల్లో బీజేపీ నాయకులు పోలింగ్ బూత్ సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లోని 137, 138, 148, 149 పోలింగ్ బూత్‌లలో కమిటీ సభ్యులతో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షుడు చందూరి హన్మాండ్లు మాట్లాడుతూ.. గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల గురించి వివరించాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో మోహన్ రెడ్డి, వడ్ల సతీశ్, మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, గంగాధర్ గుప్తా, బూత్ అధ్యక్షులు పవన్, లక్ష్మణ్, గోపాల్ రెడ్డి, శేఖర్, సాయిలు, కృష్ణ, రాజు, సాయి పాల్గొన్నారు.